

సమావేశంలో మాట్లాడుతున్న బాలానగర్ ఏసీపీ హనుమంతరావు

హనుమాన్ ర్యాలీలను శాంతియుతంగా నిర్వహించాలి : ఏసీపీ

బేగంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా ర్యాలీలు శాంతి యుతంగా నిర్వహించేలా ఉత్సవ కమిటీ ప్రతినిధులు సహకరించాలని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు కోరారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ నెల 12న జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణపై ఉత్సవ కమిటీలతో సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఏసీపీ హనుమంతరావు మాట్లాడుతూ ర్యాలీలో పెద్ద పెద్ద సౌండ్ బాక్స్‌లకు, డీజేలకు అనుమతి లేదని అన్నారు. డీజేలు ఉపయోగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతుల కోసం నిర్వాహకులు ముందే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు తీసుకున్న వారికి పోలీసులు బందోబస్తు కల్పిస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వరరావు, ధనుంజయరెడ్డి తదితరులు

వెంగళరావునగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించండి

వెంగళరావునగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, కాలనీవాసుల కోసం స్థలాన్ని కేటాయించాలని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు సమితి సంయుక్త కార్యదర్శి బి.ధనుంజయరెడ్డి, సభ్యులతో కలిసి రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గురువారం మంత్రుల క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంకును తొలగించి ఆ స్థలాన్ని కాలని అవసరాల కోసం కేటాయించాలని మంత్రిని కోరినట్టు వెంకటేశ్వరరావు తెలిపారు.



సమతా మూమెంట్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మీరా కుమార్

సమతా మూమెంట్ క్యాలెండర్ ఆవిష్కరణ

అమీర్‌పేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సి.నారాయణ కుమారుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో రూపొందించిన బాబూ జగ్జీవన్‌రామ్ ఆలిండియా సమతా మూమెంట్ క్యాలెండర్‌ను లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ గురువారం ఢిల్లీలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సమతా మూమెంట్ సభ్యులు ప్రజా సేవలో ముందుండాలని, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మూమెంట్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణతో పాటు ధీరజ్, సుధ, అక్షిత, నారాయణ, భరత్ గోర్, బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మన్ జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్లోబల్ ట్రీ వ్యవస్థాపకులు శ్రీకర్ అలపాటి తదితరులు

రేపు గ్లోబల్ ఎడ్యుకేషన్ సెమినార్

బేగంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ట్రీ ఆధ్వర్యంలో యూకే విద్యపై అవగాహన కల్పించేందుకు గ్లోబల్ ఎడ్యుకేషన్ సెమినార్‌ను ఈ నెల 12న బంజారాహిల్స్‌లోని ముఫఖంజా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకర్ అలపాటి తెలిపారు. గురువారం పంజాగుట్టలో గల గ్లోబల్ ట్రీ కార్యాలయంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ సెమినార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సెమినార్‌లో విద్యార్థులకు ఉపకార వేతనాల వివరాలతో పాటు దరఖాస్తు రుసుము మినహాయింపులను వివరిస్తామని తెలిపారు. అగ్రశ్రేణి విశ్వ విద్యాలయాల గురించి తెలుసుకునే వీలుంటుందన్నారు. ఈ సమావేశంలో యూకే పార్లమెంట్ మాజీ సభ్యులు వీరేంద్ర శర్మ, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఎర్రగడ్డలో 'పోషణ పక్షం'



పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా ఎర్రగడ్డలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు, కిశోర బాలికలకు ఎర్రగడ్డ సెక్టార్ సూపర్‌వైజర్ శోభారాణి పోషకాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ శకుంతల ఎర్రగడ్డ, బంజారానగర్, ఛత్రపతి శివాజీనగర్, ఓల్డ్ సుల్తాన్ నగర్‌లకు చెందిన టీచర్లు, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

\- ఎర్రగడ్డ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి)

దాసారం బస్తీవాసుల్లో దడ.. దడ..!

- 30 ఏళ్ల క్రితం 3ఎకరాల్లో 300కు పైగా గుడిసెలు
- కోర్టు అనుమతులు వచ్చాయంటూ స్థలం చుట్టూ ఫెన్సింగ్
- గుడిసెలను తొలగించకుండా చూడాలని ఎమ్మెల్యేకు బస్తీవాసుల వినతి

బేగంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట మండలం బీకేగూడ గ్రామ సర్వే నంబరు 144లోని దాసారం బస్తీకి సమీపంలో సుమారు మూడున్నర ఎకరాలకు పైగా స్థలం ఉంది. ఈ స్థలం విషయంపై కొన్ని సంవత్సరాలుగా వివాదాలు నడుస్తున్నాయి. 30 సంవత్సరాల క్రితం రాయలసీమ జిల్లాలకు చెందిన పేదలు నగరానికి వలసొచ్చి ఇక్కడ గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వీరంతా నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల నుంచి చెత్తను సేకరించి ఉపాధి పొందుతున్నారు. ఈ స్థలంపై ముగ్గురు వ్యక్తుల మధ్య వివాదం నెలకొంది. అయితే, అప్పట్లో ఈ స్థలం ప్రభుత్వానిది అనే ప్రచారం సైతం జరిగింది. ఇటీవల కోర్టులో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని రెండు రోజుల క్రితం కొందరు వ్యక్తులు ఎక్సకవేటర్‌తో ఖాళీగా ఉన్న స్థలాన్ని చదును చేయడం వంటి పనులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు స్థలం చుట్టూ రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు పనులను పోలీస్ పహారాలో నిర్వహిస్తున్నారు. దీంతో గుడిసె వాసుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం గుడిసెలు ఉన్న ప్రాంతాన్ని కదిలించకుండా షెడ్లు, ఖాళీగా ఉన్న స్థలంను స్వాధీనం చేసుకునే విధంగా పనులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. ఇవి పూర్తయిన అనంతరం ఇక్కడ ఉన్న సుమారు 300లకు పైగా గుడిసెవాసులను ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు

ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకున్న వారికి ప్రభుత్వం పలు సదుపాయాలను కల్పించింది. తాగునీటి వసతి కల్పించడంతో పాటు డ్రైనేజీ లైన్లు నిర్మించింది. వీధి దీపాలు ఏర్పాటు చేసి, కొందరికి కరెంటు మీటర్లను ఇచ్చింది. సమీపంలోని గుడిసెవాసులకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఇక వారిలో భయాందోళనలు లేకుండా పోయాయి. తాజాగా రెండు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్‌లతో ఖాళీ స్థలాలకు రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తుండడంతో స్థానికుల్లో టెన్షన్ మొదలైంది. ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని స్థల హక్కుదారులుగా చెప్పుకుంటున్న వారు గుడిసెవాసులకు హుకూం జారీ చేస్తుండడంతో ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలని, తమ పరిస్థితి ఏంటని గుడిసెవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదల జోలికొస్తే సహించం : ఎమ్మెల్యే తలసాని



బస్తీ వాసుల సమక్షంలో అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

పేదల జోలికొస్తే సహించమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. కొందరు వ్యక్తులు తమ అనుచరులతో వచ్చి సనత్‌నగర్‌లోని దాసారంలో గుడిసెలు ఖాళీ చేయాలని హెచ్చరించడంతో ఆందోళనకు గురైన గుడిసెవాసులు గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు వెళ్లమంటే ఎక్కడికి వెళతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తలసాని రెవెన్యూ, పోలీసు, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పేదల గుడిసెలు తొలగించకుండా, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, గుడిసెవాసులకు అండగా ఉంటానని వారికి ఎమ్మెల్యే బరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బస్తీ వాసులతో పాటు బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.



దాసారం బస్తీలో ఖాళీ స్థలాన్ని చదును చేస్తున్న ఎక్సకవేటర్

ఫెన్సింగ్ పనులను నిలిపివేసిన రెవెన్యూ అధికారులు

సనత్‌నగర్‌లోని దాసారం బస్తీ గుడిసెల స్థలంలో రెండు రోజులుగా జరుగుతున్న మట్టి చదును, ఫెన్సింగ్ పనులను రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. గురువారం సాయంత్రం అమీర్‌పేట తాహసీల్దార్ పద్మ సుందరి తన సిబ్బందితో కలిసి దాసారం బస్తీలో గుడిసెల వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వహిస్తున్నవారిని కలిసి పర్మిషన్‌కు సంబంధిత పత్రాలను అడగగా వారు చూపించలేదు. దీంతో వెంటనే పనులు ఆపేయాలని వారిని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్థలంపై మల్టీపుల్ కేసులు ఉన్నాయని, వెంటనే పనులు ఆపేయాలన్నారు. పర్మిషన్ పత్రాలు చూపించని యెడల వేసిన ఫెన్సింగ్‌ను తొలగించడంతో పాటు చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



దాసారం బస్తీలో చదును చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న అమీర్‌పేట తహసీల్దార్ పద్మసుందరి

సానుకూల దృక్పథం పెంపొందించేలా మీడియా కృషి చేయాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించేలా మీడియా కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. సమాజం, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాల్సిన మీడియా విశ్వసనీయతను పోగొట్టుకోకూడదన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రతినిధులు గురువారం వెంకయ్యనాయుడిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు ప్రాంతీయ పార్టీలకు ముప్పు అనే వాదనలో పసలేదన్నారు. లోక్‌సభకు, ఏదైనా ఒక రాష్ట్ర అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరిగినా కేంద్రంలో ఒక పార్టీని, రాష్ట్రంలో మరో పార్టీని ఎన్నుకున్న సందర్భాలు గతంలో చాలా ఉన్నాయని వెంకయ్యనాయుడు వివరించారు.

బిల్లుల ఆమోదంపై గవర్నర్‌ల కాలయాపన తగదు: విద్యాసాగర్‌రావు

బిల్లుల ఆమోదంపై గవర్నర్‌ల కాలయాపన తగదని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం మంచిదేనన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్‌లు అంతులేని జాప్యం చేయడంపై సుప్రీం అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని చూస్తే అక్కడా ఇలాంటి తీర్పే రావొచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా- తెలంగాణ గౌరవ అధ్యక్షులు కృపాకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రాజేశ్వర్, శేషుకుమారి, బీఆర్ఎస్ నాయకులు

హనుమాన్ జయంతికి తలసానికి ఆహ్వానం

అమీర్‌పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పూజా కార్యక్రమం, విజయోత్సవ ర్యాలీలో పాల్గొనాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు బల్కంపేట వీరహనుమాన్ వ్యాయామ శాల నిర్వాహకుడు బి.రాజేశ్వర్, మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ మేరకు గురువారం తలసానిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ, వనం శ్రీనివాస్, కట్టా బలరాం, సుందర్, గోవింద్ సింగ్, ముత్యాల సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప జన్మనక్షత్ర వేడుకలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప జన్మనక్షత్రం పురస్కరించుకొని శుక్రవారం శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజాదికాలు నిర్వహిస్తున్నట్టు ఈవో శ్రీనివాస్ శర్మ తెలిపారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక సుప్రభాత సేవ అనంతరం 1,116 కిలోల ఆవు నెయ్యితో అభిషేకం అనంతరం పడిపూజ, పల్లకి సేవ నిర్వహించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం, సాయంత్రం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు.

జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో అక్రమంగా ప్రవేశించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో అక్రమంగా ప్రవేశించి ఫొటోలు తీస్తూ బెదిరింపు దోరణిలో వ్యవహరించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పది రోజుల క్రితం పెద్ది వేణుగోపాల్ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా జూబ్లీహిల్స్ ఇంటర్నెషనల్ క్లబ్ ఆవరణలోకి ప్రవేశించాడని పోలీసులకు క్లబ్ మేనేజర్ జగదీశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఫొటోలను జీహెచ్ఎంసీ అధికారులకు పంపిస్తూ బెదిరింపు దోరణతో వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 9న వేణుగోపాల్ పేరు చెప్పి కొంతమంది ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా క్లబ్‌లోకి ప్రవేశించి మరోసారి ఫొటోలు తీశారని పేర్కొన్నారు. క్లబ్‌లోకి అక్రమంగా ప్రవేశించిన వేణుగోపాల్ మరికొంత మందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 329(3), 308(3) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పార్క్ చేసిన ఆటో మాయం

బంజారాహిల్స్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఇంటి ఎదుట పార్క్ చేసిన ఆటో మాయమైంది. ఫిలింనగర్ వల్లభాయ్ పటేల్‌నగర్‌కు చెందిన అంకలవారి సురేష్ ఆటో డ్రైవర్, బంధువు శ్రీవేణి వద్ద ఆటో అద్దెకు తీసుకొని నడుపుకుంటున్నాడు. ఈ నెల 8న రోజూ మాదిరిగానే తన ఇంటి ఎదుట ఆటో పార్కింగ్ చేశాడు. ఉదయం లేచి చూడగా ఆటో కనిపించలేదు. చోట్ల ఆచూకీ లభించక పోవడంతో సురేష్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో మద్యం బాటిళ్ల పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రైలులో మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 28 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గురువారం రోజూ మాదిరిగానే రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న ఇసార్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించిన పోలీసులకు ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చి అతడి బ్యాగ్‌లను తనిఖీ చేయగా, మద్యం బాటిళ్లు కనిపించాయి. పోలీసులు అతడిని విచారించగా పేరు శివ అని, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అతను హరియాణా నుంచి సికింద్రాబాద్ మీదుగా మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్నాడని వెల్లడైంది. పోలీసులు అతడి నుంచి రూ. 12 వేల విలువ చేసే 28 బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

- సీఎం ఇంటి ముట్టడికి యత్నం
- లడాయి సేవాలాల్ బంజారా సంఘం నేతల అరెస్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతూ లడాయి సేవాలాల్ బంజారా సంఘం ప్రతినిధులు గురువారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కొర్ర మోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 45 నియోజకవర్గాల్లో లక్షల సంఖ్యలో లంబాడీల ఓట్లు కలిగి ఉన్నట్టు, ప్రభుత్వం నిర్లక్ష్య దోరణితో వ్యవహరిస్తే గెలుపు ఓటముల్లో తమ ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించక పోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తామని ఆయన హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సక్రి బాయి, అధ్యక్షుడు కొర్ర చందునాయక్, ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్‌నాయక్, జాతీయ ఉపాధ్యక్షుడు ధరావత్ గణేష్‌నాయక్, రమావత్ అభిషేక్‌నాయక్, రాజేష్‌నాయక్, కె.శాంతి బాయి తదితరులు ఉన్నారు.



లడాయి సేవాలాల్ బంజారా సంఘం నేతలను లాక్కెళ్తున్న పోలీసులు

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 46లోని అంబేడ్కర్‌నగర్‌కు ఆనుకొని మస్తాన్‌నగర్ ఉంది. ఇక్కడ గతంలో ప్రభుత్వం జేఎన్‌యూఆర్ఎం కింద ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు కేటాయించింది. అయితే, లబ్ధిదారులు కొంతమంది భవనాల పక్కనే ఉన్న 800 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని పెద్ద పెద్ద షెడ్డులు నిర్మించారు. సమాచారం అందుకున్న షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకొని కూల్చివేతలు చేపట్టారు. ఆక్రమణ దారులైన ఎంకన్న, అరుణ తదితరులు ఎక్సకవేటర్‌ను అడ్డుకునేందుకు కారును అడ్డుగా పెట్టారు. అధికారులు కారును సీజ్ చేయడంతో వాగ్వావాదానికి దిగారు. తమ కుటుంబాలు పెరిగాయని అందుకే నిర్మాణాలు చేపట్టామని, ధనవంతులను వదిలేసి పేద వారి మీద ప్రతాపం చూపిస్తారా అంటూ నిలదీశారు. చివరకు రెవెన్యూ సిబ్బంది కూల్చివేతలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో కూడా ఇక్కడ కబ్జా చేసేందుకు ప్రయత్నించగా క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. అయినప్పటికీ మరోసారి ఆక్రమించారని, కూల్చివేతల అనంతరం ప్రభుత్వ సూచిక బోర్డును ఏర్పాటు చేయనున్నట్టు వారు తెలిపారు.



ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మధురానగర్ ఎఫ్-బ్లాక్‌లో విద్యుత్ తీగలపై ఒరిగిన భారీ వృక్షం

- 3 గంటల పాటు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

వెంగళరావునగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులకు మధురానగర్ ఎఫ్-బ్లాక్‌లో భారీ వృక్షం 11కేవీ విద్యుత్ తీగలపై ఒరిగింది. దీంతో యూసుఫ్‌గూడ ఫీడర్ పరిధిలోని మధురానగర్ సీ,ఈ,ఎఫ్,జీ ప్రాంతాల్లో మూడు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ డీఈ హనుమంత్‌రెడ్డి, ఏఈలు వెంకటేష్, తిరుపతిరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని క్రెన్ సాయంతో విద్యుత్ తీగలపై ఒరిగిన చెట్టు కొమ్మలను తొలగించారు. మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు అధికారులకు పరిస్థితిని వివరించారు. పనులు పూర్తి అయిన తరువాత రాత్రి 8 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



విద్యుత్ తీగలపై ఒరిగిన భారీ వృక్షం



పాదయాత్రలో పాల్గొన్న మేకల సారంగపాణి తదితరులు

తెలంగాణలో బీజేపీదే అధికారం: మేకల

బౌద్ధనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ దేశవ్యాప్తంగా తలపెట్టిన బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం సీతాఫల్‌మండి డివిజన్‌లో అపార్టీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జ్‌లు కుమారస్వామి, ఆకుల సంపత్, చోటాప్రభు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని పలు చోట్ల పార్టీ జెండాలను ఆవిష్కరించి బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కుటుంబ పాలన అవినీతి అక్రమాలలో కారణంగా బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందన్నారు. ప్రసుత్తం ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు నరేష్, నాయకులు ప్రభుగుప్తా, ముఠాగణేశ్, నీలిశ్రీనివాస్, శ్యామ్, కరుణాకర్, వెంకటేశ్, రాజు, వినయ్ తదితరులున్నారు.



బీజేపీ బస్తీబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మోండా డివిజన్ సాంబమూర్తినగర్‌లో పర్యటించారు. బీజేపీ జెండా ఎగుర వేశారు. ఇంటింటకీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, కార్పొరేటర్ కొంతం దీపిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. - (రెజిమెంటల్ బజార్,ఆంధ్రజ్యోతి)



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఆదర్శ్ ముదిరాజ్, శారదా మల్లేష్ తదితరులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిలకలగూడ, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. హమాల్ బస్తీ, ఆలుగడ్డ బావిల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్, కందాడి నాగేశ్వర్, రాజేష్ నాయర్, మల్లిశ్వరి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నేతకు కేంద్ర మంత్రి సత్కారం

మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గతంలో ఆయనతో కలిసి పనిచేసిన బౌద్ధనగర్‌కు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ వెంకటరమణిని పార్టీ కార్యాలయంలో సత్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ తదితరులు.
-(బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)

పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి

● పా. గాలి వినోద్ కుమార్



మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్

తార్నాక, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన మహాత్మా జ్యోతిరావ్ పూలే దంపతులకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తార్నాకలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిరావ్ పూలే దంపతులతో పాటు, బహుజన సిద్ధాంతకర్త కాన్షీరాం, డా. బాబూ జగ్జీవన్‌రామ్‌లకు భారతరత్న అవార్డును ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా ఏప్రిల్ మాసాన్ని మహనీయుల నెలగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సైదయ్య

ప్రశాంతంగా ర్యాలీలు నిర్వహించాలి

● మహంకాళి ఏసీపీ సైదయ్య

రాంగోపాల్‌పేట్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి సందర్భంగా ర్యాలీలను శాంతియుత వాతావరణంలో భక్తిభావంతో నిర్వహించుకోవాలని మహంకాళి ఏసీపీ సైదయ్య పిలుపునిచ్చారు. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం వివిధ హిందూ సంఘాలు నిర్వహించే ర్యాలీల ఏర్పాట్లపై ప్రసాదాల పంపిణీదారులు, పీస్ కమిటీలు, వెల్‌కం స్టేజీల నిర్వాహకులతో గురువారం మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ పరశురామ్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ సైదయ్య మాట్లాడుతూ, కోఠి నుంచి వచ్చే ప్రధాన ర్యాలీ బన్సీలాల్‌పేట వద్ద గల బైబిల్ హౌస్ వద్ద మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోకి ప్రవేశించి బాటా ఎక్స్ రోడ్డు, సుబాష్ రోడ్డు, ఎంజీ రోడ్డులోని రాంగోపాల్‌పేట్ ఓల్డ్ పీఎస్, ప్యారడైజ్ చౌరస్తా, సీటీఓ చౌరస్తాల మీదుగా తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు సాగుతుందన్నారు. ఈ రూట్‌లో స్వాగత వేదికలు, ప్రసాద పంపిణీ కేంద్రాలు, మంచినీరు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేసేవారు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారితో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు పరదేశి జాన్, వెంకటేశ్వర్లు, మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు మక్తాల జలంధర్ గౌడ్, రాంగోపాల్‌పేట్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సందీప్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

దాసారం బస్తీవాసుల్లో దడ.. దడ..!

- 30 ఏళ్ల క్రితం 3ఎకరాల్లో 300కు పైగా గుడిసెలు
- కోర్టు అనుమతులు వచ్చాయంటూ స్థలం చుట్టూ ఫెన్సింగ్
- గుడిసెలను తొలగించకుండా చూడాలని ఎమ్మెల్యేకు బస్తీవాసుల వినతి

బేగంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట మండలం టీకేగూడ గ్రామ సర్వే నంబరు 144లోని దాసారం బస్తీకి సమీపంలో సుమారు మూడున్నర ఎకరాలకు పైగా స్థలం ఉంది. ఈ స్థలం విషయంపై కొన్ని సంవత్సరాలుగా వివాదాలు నడుస్తున్నాయి. 30 సంవత్సరాల క్రితం రాయలసీమ జిల్లాలకు చెందిన పేదలు నగరానికి వలసొచ్చి ఇక్కడ గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వీరంతా నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల నుంచి చెత్తను సేకరించి ఉపాధి పొందుతున్నారు. ఈ స్థలంపై ముగ్గురు వ్యక్తుల మధ్య వివాదం నెలకొంది. అయితే, అప్పట్లో ఈ స్థలం ప్రభుత్వానిది అనే ప్రచారం సైతం జరిగింది. ఇటీవల కోర్టులో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని రెండు రోజుల క్రితం కొందరు వ్యక్తులు ఎక్సకవేటర్‌తో ఖాళీగా ఉన్న స్థలాన్ని చదును చేయడం వంటి పనులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు స్థలం చుట్టూ రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు పనులను పోలీస్ పహారాలో నిర్వహిస్తున్నారు. దీంతో గుడిసె వాసుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం గుడిసెలు ఉన్న ప్రాంతాన్ని కదిలించకుండా షెడ్లు, ఖాళీగా ఉన్న స్థలంను స్వాధీనం చేసుకునే విధంగా పనులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. ఇవి పూర్తయిన అనంతరం ఇక్కడ ఉన్న సుమారు 300లకు పైగా గుడిసెవాసులను ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు

ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకున్న వారికి ప్రభుత్వం పలు సదుపాయాలను కల్పించింది. తాగునీటి వసతి కల్పించడంతో పాటు డ్రైనేజీ లైన్లు నిర్మించింది. వీధి దీపాలు ఏర్పాటు చేసి, కొందరికి కరెంటు మీటర్లను ఇచ్చింది. సమీపంలోని గుడిసెవాసులకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఇక వారిలో భయాందోళనలు లేకుండా పోయాయి. తాజాగా రెండు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్‌లతో ఖాళీ స్థలాలకు రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తుండడంతో స్థానికుల్లో టెన్షన్ మొదలైంది. ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని స్థల హక్కుదారులుగా చెప్పుకుంటున్న వారు గుడిసెవాసులకు హుంకుం జారీ చేస్తుండడంతో ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలని, తమ పరిస్థితి ఏంటని గుడిసెవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదల జోలికొస్తే సహించం : ఎమ్మెల్యే తలసాని



బస్తీవాసుల సమక్షంలో అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

పేదల జోలికొస్తే సహించమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. కొందరు వ్యక్తులు తమ అనుచరులతో వచ్చి సనత్‌నగర్‌లోని దాసారంలో గుడిసెలు ఖాళీ చేయాలని హెచ్చరించడంతో ఆందోళనకు గురైన గుడిసెవాసులు గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు వెళ్లమంటే ఎక్కడికి వెళతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తలసాని రెవెన్యూ, పోలీసు, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పేదల గుడిసెలు తొలగించకుండా, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, గుడిసెవాసులకు అండగా ఉంటానని వారికి ఎమ్మెల్యే బరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బస్తీవాసులతో పాటు బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.



దాసారం బస్తీలో ఖాళీ స్థలాన్ని చదును చేస్తున్న ఎక్సకవేటర్

ఫెన్సింగ్ పనులను నిలిపివేసిన రెవెన్యూ అధికారులు



దాసారం బస్తీలో చదును చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న అమీర్‌పేట తహసీల్దార్ పద్మసుందరి

సనత్‌నగర్‌లోని దాసారం బస్తీ గుడిసెల స్థలంలో రెండు రోజులుగా జరుగుతున్న మట్టి చదును, ఫెన్సింగ్ పనులను రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. గురువారం సాయంత్రం అమీర్‌పేట తాహసీల్దార్ పద్మ సుందరి తన సిబ్బందితో కలిసి దాసారం బస్తీలో గుడిసెల వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వహిస్తున్నవారిని కలిసి పర్మిషన్‌కు సంబంధిత పత్రాలను అడగగా వారు చూపించలేదు. దీంతో వెంటనే పనులు ఆపేయాలని వారిని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్థలంపై మల్టీపుల్ కేసులు ఉన్నాయని, వెంటనే పనులు ఆపేయాలన్నారు. పర్మిషన్ పత్రాలు చూపించని యెడల వేసిన ఫెన్సింగ్‌ను తొలగించడంతో పాటు చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

● బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు సౌందర్య

అడ్డగుట్ట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లోని పెండింగ్ సమస్యలపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య తెలిపారు. అడ్డగుట్టలో గురువారం నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి వెంకటేష్ గౌడ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ, డివిజన్‌లోని సాయినగర్, వడ్డెరబస్తీల్లో పర్యటించి 11 ఏళ్లుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చామన్నారు. తుకారాంగేట్ ముత్యాలమ్మ ఆలయం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం, తుకారాంగేట్ చౌరస్తాలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని నీటితో శుభ్రం చేయడంతో పాటు తుకారాంగేట్‌లోని అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లి సమస్యల్ని అడిగి తెలుసుకున్నామన్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని డీఎంహెచ్‌ఓకు ఫోన్ ద్వారా తెలియజేసి వైద్యుడిని వెంటనే నియమించాలని కోరామన్నారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు, కృష్ణ, వీరేశం, హంసరాజు, వెంకట స్వామి, లక్ష్మణ్, ఉదయ్ యాదవ్, శివాజీ, శ్యామల, ప్రేమలత పాల్గొన్నారు.



మైనర్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

మైనర్లు వాహనాలను నడపరాదు

● ఏసీపీ శంకర్ రాజు

తిరుమలగిరి ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలను నడపరాదని ఏసీపీ శంకర్ రాజు స్పష్టం చేశారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైనర్ డ్రైవింగ్‌పై నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై గురువారం కేసులు నమోదు చేశారు. మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఏసీపీ శంకర్ రాజు. తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధు బాబు కౌన్సెలింగ్ ఇచ్చారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం గేరు లేని బైకు నడపడానికి కనీస వయసు 16 ఏళ్లు, గేరు బైకు నడపడానికి కనీస వయసు 18 ఏళ్లు అని వారు తెలిపారు. ముఖ్యంగా 50 సీసీకి మించిన ఇంజిన్ సామర్థ్యం ఉన్న బైక్‌ను 18 సంవత్సరాల వయసు వచ్చిన వారు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ నుంచి లైసెన్స్ పొందిన తర్వాతే నడపాలని ఏసీపీ స్పష్టం చేశారు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, ఆ తర్వాత కోర్టులో ప్రవేశపెడతామన్నారు. వారికి మేజిస్ట్రేట్ విడి విడిగా శిక్ష విధిస్తారని, కావున మైనర్ డ్రైవింగ్‌ను తల్లిదండ్రులు ప్రోత్సహించవద్దని ఏసీపీ శంకర్ రాజు హెచ్చరించారు. కాగా, ఇప్పటి వరకు నార్త్ జోన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై 109 కేసులు నమోదు చేశామన్నారు.

13 న గ్రాండ్ బైశాఖి మేళా

● హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహణ
● తెలంగాణ పంజాబీ సభ అధ్యక్షుడి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ పంజాబీ సభ సభ్యులు

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పంజాబీ సంస్కృతిని కాపాడటం, ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా గ్రాండ్ బైశాఖీ మేళాను నిర్వహిస్తున్నామని తెలంగాణ పంజాబీ సభ అధ్యక్షుడు రవీందర్ సింగ్ సర్నా అన్నారు. ఈ నెల 13న హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించే గ్రాండ్ బైశాఖీ మేళా వివరాలను గురువారం సికింద్రాబాద్‌లో విలేకరులకు తెలియజేశారు. 1963లో స్థాపించిన తెలంగాణ పంజాబీ సభ ఆరు దశాబ్దాలుగా పంజాబీ సంస్కృతి, సమాజ సేవా పరంగా ఎంతో కృషి చేస్తున్నదన్నారు. లోహ్రీ, బైసాఖీ, దివాళీ మిలాన్ ఉత్సవాలు, ప్రదర్శనలు, ఉత్సవ విందులు నిర్వహిస్తూ పంజాబీ సంస్కృతిని కాపాడుతున్నదని అన్నారు. గ్రాండ్ బైశాఖీ మేళాలో ప్రముఖ పంజాబీ గాయకుడు గురుదాస్ మాన్ జీ ప్రత్యక్ష ప్రదర్శన, పాటియాలకు చెందిన ప్రముఖ డాన్స్ బృందంచే భాంగ్రా, గిద్దా ప్రదర్శన, చండీగఢ్‌కు చెందిన శశి ధీమన్ హాస్య ప్రదర్శన ఉంటాయన్నారు. మూడు నుంచి నాలుగు వేల మంది హాజరయ్యే ఈ మేళాలో సంగీతం, నృత్యం, సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తాయన్నారు. ఈ వేడుకలకు తెలంగాణ టూరిజం డెవలప్‌మెంటు కార్పొరేషన్ అధికారిక ఆతిథ్య భాగస్వామిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సభ ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్ కపూర్, హరీష్, ప్రధాన కార్యదర్శి జోగిందర్ సింగ్ ముజ్రాల్, సలహాదారుడు సురేందర్ పాల్ సింగ్ సలూజ,హర్‌ప్రీత్ సింగ్ చాబ్రా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు శక్తినగర్ కాలనీవాసుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యేను కలిసిన శక్తినగర్ కాలనీవాసులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా ఉన్న తమ కాలనీ రోడ్డు సమస్యను పరిష్కరించినందుకు ఆర్యేపురం శక్తి కాలనీ వాసులు గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను తుకారాంగేట్ లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ సహకారంతో సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ 1.15 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఆనందంగా ఉందని కాలనీవాసులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో ఎవ్వరూ తమ రోడ్డు సమస్యను పట్టించుకోలేదన్నారు. అయితే, కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన కొద్ది నెలల్లోనే శ్రీగణేశ్ తమ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడమే కాకుండా ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని కాలనీ వాసులు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

● సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్

రాంగోపాల్‌పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునే వారు ఆదాయ, కుల సర్టిఫికెట్ల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సికింద్రాబాద్ తహసీల్దార్ ఇస్లావత్ పాండు నాయక్ సూచించారు. గురువారం సర్దార్ పటేల్ రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదాయ, కుల తదితర సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులు నేరుగా కార్యాలయంలోని సిబ్బందిని కలవాలని, సరైన ధ్రువపత్రాలు సమర్పిస్తే త్వరగా సర్టిఫికెట్లను మంజూరు చేస్తామన్నారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో తిష్ట వేస్తున్న కొందరు దళారులు దరఖాస్తుదారులను సర్టిఫికెట్లు త్వరగా ఇప్పిస్తామని చెప్తున్నట్టు తెలిసిందని, అలాంటి వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ కార్యాలయ సిబ్బంది ఎవరైనా లంచం అడిగితే వెంటనే తన దృష్టికి, లేదా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.



అభినందనలు

దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ రైల్‌నిలయంలో ప్రిన్సిపల్ చీఫ్ అడ్వయిజర్‌గా బాధ్యతలు చేపట్టిన టి.హేమాసునీతను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న ఎంప్లాయీస్ సంఘం ప్రతినిధులు గడ్డం సత్యనారాయణ, రఘునాథ్, సతీష్, సికిందర్ మీర్జా, యశ్విని తదితరులు. (చిలకలగూడ,ఆంధ్రజ్యోతి)



నిందితుడిని, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న రైల్వే పోలీసులు

రైలులో మద్యం బాటిళ్ల పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రైలులో మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 28 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గురువారం రోజూ మాదిరిగానే రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న ఇసార్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించిన పోలీసులకు ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చి అతడి బ్యాగ్‌లను తనిఖీ చేయగా, మద్యం బాటిళ్లు కనిపించాయి. పోలీసులు అతడిని విచారించగా, పేరు శివ అని, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అతను హర్యానా నుంచి సికింద్రాబాద్ మీదుగా మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్నాడని వెల్లడైంది. పోలీసులు అతడి నుంచి రూ. 12 వేల విలువ చేసే 28 బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



ఆంథోని

అడ్డగుట్ట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట కమ్యూనిటీ హాల్ సమీపం లో నివాసముంటున్న ఆంథోని (46) మానసిక సమస్యతో బాధ పడుతున్నాడు. ఈనెల 7న ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆంథోని ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య పుష్ప బంధు, మిత్రుల ఇళ్లలో వాకబు చేసినా భర్త ఆచూకీ తెలియరాలేదు. రెండు మూడు రోజులైనా ఇంటికి రాకపోవడంతో భార్య గురువారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆంథోని ఆచూకీ తెలిసిన వారు తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

దూద్‌బావిలో పెయింటర్



ఎం.రాజు

బౌద్ధనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెయింటర్ అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ దూద్‌బావికి చెందిన ఎం.రాజు(48) పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. రాజు కొంత కాలంగా మద్యానికి అలవాటుపడ్డాడు. ఈనెల 3వ తేదీన ఉదయం 9.30కి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో భార్య నిర్మల తన భర్త కనిపించటం లేదని మంగళవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.